ప్రజాశక్తి
శనివారం 6 జూలై 2024
5
శ్రీకాకుళం

ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు పరిశీలన

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని పెద్దపాడు సాంఘిక సంక్షేమశాఖ గురుకులంలో జిల్లాలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ఎం.ప్రసాదరావు శుక్రవారం పరిశీలించారు. పెద్దపాడుతో పాటు ఎచ్చెర్ల, టెక్కలి, సోంపేటలో ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు అకడమిక్ మోనటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ వివరించారు. పరిశీలన అనంతరం ప్రసాదరావు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు స్కూల్ లీడర్‌గా ఉపాధ్యాయుల బోధనా సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. మదింపు చేసి ఉపాధ్యాయులకు తగు సూచనలు ఇవ్వటానికి ఈ టీచ్ టూల్ ట్రైనింగ్ తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ నక్క రామకృష్ణ, సిఎంఒ పేడాడ ప్రభాకరరావు, సాల్ట్ కోఆర్డినేటర్ నాగరాజు, సాంఘిక సంక్షేమ శాఖ గురుకులం ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి, మాస్టర్ ట్రైనర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధునికీకరణకు మోక్షం లభించేనా?

- తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ప్రతిపాదనలు
- రూ.450 కోట్ల నుంచి రూ.950 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం
- వంశధార మోడర్‌నైజేషన్‌తోనే శివారుకు సాగునీరు
- కొత్త ప్రభుత్వం దృష్టిసారిస్తే తీరనున్న సాగునీటి కష్టాలు

జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న వంశధార ప్రాజెక్టు ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరందని పరిస్థితి నెలకొంది. సుమారు నాలుగున్నర దశాబ్దాల కిందట నిర్మించిన కుడి, ఎడమ కాలువలు దయనీయంగా మారడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కాలువలను ఆధునికీకరణ కోసం పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. టిడిపి అధికారంలో ఉండగా రెండు, మూడు పర్యాయాలు పంపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన రెండుసార్లు నివేదించారు. అయినా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీంతో కాలువ గట్లు బలహీనంగా మారాయి. కొన్నిచోట్ల కాలువ గట్లకు గండి పడ్డాయి. దీంతో బ్యారేజీలో నీళ్లున్నా పూర్తిస్థాయిలో నీరు విడిచిపెట్టలేని పరిస్థితి తలెత్తుతోంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే కాలువల ఆధునికీకరణ ఒక్కటే మార్గమని అధికారులు చెప్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా చొరవ తీసుకుంటే రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరనున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ప్రాజెక్టును హిరమండలం వద్ద 1970లో స్టేజ్-1 కింద గొట్టాబ్యారేజీ నిర్మాణంతో పాటు కుడి, ఎడమ కాలువలను నిర్మించారు. కాలువల్లోకి 1977 నుంచి నీటిని విడిచిపెట్టడం మొదలుపెట్టారు. అప్పట్నుంచి కాలువలు ఆధునికీకరణకు నోచుకోలేదు. కాలువ నుంచి 12 మండలాల పరిధిలోని 1,48,000 ఎకరాలకు సాగునీరందించేలా కాలువను నిర్మించారు. కాలువ నుంచి 2,480 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టేలా కాలువను డిజైన్ చేశారు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1800 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువల నిర్వహణ లేకపోవడం, గట్లు బలహీనంగా ఉండడంలో అంతకుమించి నీటిని వదిలితే గండి కొట్టే ప్రమాదమూ లేకపోలేదు. కాలువ వాస్తవ సామర్థ్యం మేరకు నీటిని విడిచిపెట్టలేకపోవడంతో ప్రతి సంవత్సరం పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వేలాది ఎకరాల భూములు ఎండిపోతున్నాయి. తుపాన్లు, నీటి ప్రవాహ ఉధృతికి క్రమేణా కాలువ గట్టు కోతకు గురవుతున్నాయి. 40 ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో, ఎడమ కాలువ సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది.

హిరమండలం సమీపంలో ఎడమ కాలువపై నుంచి ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

అంతకంతకూ పెరుగుతున్న అంచనా వ్యయం

ఎడమ కాలువను ఆధునీరించాల్సిన అవసరముందంటూ గత తొమ్మిదేళ్లగా అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చి తర్వాత మొదటిసారి 2016లో రూ.456 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత చివరిసారిగా 2018లో రూ.624 కోట్లతో పంపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో మొదటిసారి పంపారు. 2021 మార్చిలో రూ.776 కోట్లతో, 2023 నవంబరులో రూ.954 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం అంచనా వ్యయం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి

గొట్టాబ్యారేజీ కుడి కాలువ ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్లతో అంచనాలు రూపొందించి పరిపాలనా ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపారు. ఆ తర్వాత 2022-23లో రూ.22 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆమోదం లభించలేదు.

రెండు పర్యాయాలు కోతకు గురైన గట్లు

వంశధార కాలువలు, గొట్టాబ్యారేజీ ప్రాంతం ఎంత బలహీనమో రెండు సందర్భాల్లో చోటుచేసుకున్న ఘటనలే అందుకు ఉదాహరణ. 2023 అక్టోబరులో వంశధారలో 80వేల క్యూసెక్కు వరద నీరు ప్రవహిస్తున్న సందర్భంలో బ్యారేజీ దిగువ కుడివైపులా గట్టు కోతకు గురైంది. గట్టును రూ.13.5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

అదేవిధంగా హిరమండలం అక్కరాపల్లి 2022 జూలైలో అండర్ టన్నల్ వద్ద కాలువకు గండి పడింది. దాన్నీ రూ.ఐదు లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలువలకు నీరు విడిచిపెడుతున్నారు. వంశధార ఉధృతంగా ప్రవహిస్తే కాలువలు, గొట్టాబ్యారేజీ గట్లు ఎప్పుడు ఏవి కొట్టుకుపోతాయో అన్న పరిస్థితి నెలకొంది. కొత్త ప్రభుత్వమైనా కాలువల ఆధునికీకరణ నిధులు కేటాయిస్తే, రైతులకు సాగు సమస్యలు తీరుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

మోడల్ జిల్లాగా తీర్చిదిద్దుదాం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నిర్దేశించుకున్న ప్రణాళికలు, లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు అడుగులు వేయాలంటే జిల్లా యంత్రాంగాన్ని సమన్వయం చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. అందకు అధికారులందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి జిల్లా అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి అందించే దిశగా పనిచేయాలని ఆదేశించారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో విధులు నిర్వహిస్తేనే మంచి ఫలితాలు సాధించగలమన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని పలు సెక్షన్లను పరిశీలించారు. అడ్మినిస్ట్రేషన్, ల్యాండ్ కో-ఆర్డినేషన్, మెజిస్టీరియల్, లీగల్ సెల్, ఎన్నికల విభాగం తదితర సెక్షన్ల కార్యకలాపాల గురించి ఆయా విభాగాధిపతులను అడిగి తెలుసుకున్నారు. ఆయా ఫైళ్లను నిర్దేశిత కాల పరిమితిలో పరిష్కరించాలని, జిల్లాస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, డిపిఒ వెంకటరావు, ఐసిడిఎస్, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు శాంతిశ్రీ, కిరణ్ కుమార్, జి.వి చిట్టిరాజు, సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్, మైన్స్ డిడీ సత్యనారాయణ, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, సిపిఒ లక్ష్మీప్రసన్న ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నష్టాల సాకుతో ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేస్తోందని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావు విమర్శించారు. నగరంలోని సంచార్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బిఎస్ఎన్ఎల్ తన సేవలను విస్తరించటానికి, సాంకేతిక శక్తిసామర్థ్యాలను పెంచుకోవడానికి ప్రయత్నించిన ప్రతిసారీ అడ్డంకులు కల్పించిందని గుర్తుచేశారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా 3జి, 4జి, 5జి సేవల్లోకి వెళ్తామన్న ప్రతిసారీ అనుమతి నిరాకరించిందని తెలిపారు. హైస్పీడ్ డేటాను తన వినియోగదారులకు అందివ్వాలని ప్రణాళికలు వేసుకుంటే అందుకు మోకాలడ్డిందన్నారు. 4జి, 5జి నిర్వహణా పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం కొనుగోలు చేస్తామని బిఎస్ఎన్ఎల్ అభ్యర్థిస్తే ఏళ్ల తరబడి కేంద్ర సమాచార, సాంకేతిక మంత్రిత్వశాఖ నుంచి అతీగతీ లేదని విమర్శించారు. బిఎస్ఎన్ఎల్‌పై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న కేంద్ర ప్రభుత్వం, ప్రయివేటు టెలికాం కంపెనీలపై ప్రేమ కనబరుస్తోందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మూడోసారి పీఠం మీద కుదురుకున్న కొద్దిరోజులకే ప్రయివేటు టెలికాం కంపెనీలు మొబైల్ రీఛార్జి ధరలను భారీగా పెంచి, ప్రజలపై రూ.20 వేల కోట్ల భారాన్ని మోపాయని విమర్శించారు. నిర్వహణ వ్యయానికి తగ్గట్టుగా ధరలను పెంచడం అనివార్యమైందని అవి బయటికి ప్రకటించినా, ప్రజల మొబైల్ అవసరాలను లాభాల మూటలుగా మార్చుకోవటమే వాటి అసలు ఉద్దేశమన్నారు. రీఛార్జిల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.వేల కోట్ల లాభాలు ఆర్జించిన కంపెనీలు ఇప్పుడు ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేసేందుకు సిద్ధమయ్యాయని విమర్శించారు. బిఎస్ఎన్ఎల్ బలంగా ఉన్నప్పుడు ప్రయివేటు ప్రొవైడర్ల ధరలు అదుపులో ఉండేవని గుర్తుచేశారు. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడో వేతన సవరణ ఇంతవరకు చెల్లించలేదని చెప్పారు. కోవిడ్ సమయంలో బకాయి పడిన మూడు విడతల కరవుభత్యం ఇవ్వడం లేదన్నారు. సంస్థకు కేంద్రం నుంచి రావల్సిన బకాయిలు రూ.37 వేల కోట్లు తిరిగి చెల్లించడం లేదని చెప్పారు. మరోవైపు బిఎస్ఎన్ఎల్ భూములను కారుచౌకగా కట్టబెస్తోందని విమర్శించారు. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు, పెన్షనర్లకు 15శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధనరావు

మిస్సింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అపరిష్కృతంగా ఉన్న మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించి దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీస్ అధికారులను ఆదేశించారు. మిస్సింగ్ కేసుల దర్యాప్తు, విచారణ, కేసు ఫైల్ స్టేజ్ తదితర అంశాలపై జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్ఐలతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మిస్సింగ్ కేసుల ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి కేసుల దర్యాప్తులో సాధించిన పురోగతి, సాంకేతిక ఆధారాలు, చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పిపోయిన వ్యక్తుల ట్రేస్ కోసం అన్నివిధాలుగా ప్రయత్నం చేయాలన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న వ్యక్తుల ఇటీవల కాల్ డేటా, ఆధార్, బ్యాంకు తదితర లావాదేవీలను పరిశీలించి ఎక్కడున్నారనే విషయాన్ని తెలుసుకుని ఆ చోటుకు పోలీసు బృందాలను పంపించి కేసులను ఛేదించాలని సూచించారు. సాంకేతిక ఆధారాల ద్వారా వ్యక్తుల సమాచారం తెలుసుకొని సంబంధిత వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడి పిలిపించి కేసులు పరిష్కరించాలన్నారు. యువతులు, మహిళల మిస్సింగ్ కేసులకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి, సదురు కేసులను వీలైనంత మేరకు ఛేదించి తల్లిదండ్రులకు బాధితులను అప్పగించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, ఎస్ఐలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

పోలీస్ పరేడ్ పరిశీలన

ఎచ్చెర్ల : స్థానిక ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు మైదానంలో నిర్వహించిన పోలీస్ పరేడ్ కార్యక్రమాన్ని అదనపు ఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్ శుక్రవారం పరిశీలించారు. పరేడ్ నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ శాఖలో సిబ్బందికి క్రమశిక్షణ ముఖ్యమన్నారు. శారీరక, మానసిక దృఢత్వం ఉన్నప్పుడే ఉత్సాహంగా ప్రజలకు సేవలు అందించగలమని చెప్పారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆర్ఐలు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో జిల్లా అభివృద్ధి

- వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారం, సమన్వయంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తానని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా మీడియా ప్రతినిధులతో శుక్రవారం సమావేశమైన అనంతరం మాట్లాడారు. ఎంతో చైతన్యం కలిగిన జిల్లా శ్రీకాకుళం అని, అందరితో సమన్వయం చేసుకుంటూ ప్రగతిని సాధించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం మంది వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, అందుకే ఈ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తానన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం వంటి ప్రధాన అంశాలపై పక్కా ప్రణాళిక రూపొందించుకుని మంచి ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగంలో స్వీకరించే వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. మహారాష్ట్రకు చెందిన తాను ఇంజినీరింగ్ చదివి, 2016 ఐఎఎస్ బ్యాచ్ అధికారిగా రాష్ట్రంలో అడుగుపెట్టానన్నారు. గుంటూరు అసిస్టెంట్ కలెక్టర్‌గా, తర్వాత నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేశానని చెప్పారు. కాకినాడ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్లకు కమిషనర్‌గా పనిచేసినట్లు తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎక్కువకాలం పనిచేయడం వల్ల పట్టణాభివృద్ధిపై పూర్తి అవగాహన ఉందన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల అభివృద్ధికి సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం ఆయన జిల్లా సమగ్ర స్వరూపంతో పాటు ప్రాధాన్యత గల అంశాలను అడిగి తెలుసుకున్నారు. వంశధార ప్రాజెక్టు, నదుల అనుసంధానం వంటి పలు అంశాలను జర్నలిస్టులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఎలాంటి ప్రజా ప్రయోజన సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించవచ్చని చెప్పారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - టెక్కలి

టెక్కలి ఎస్‌సి బాలుర వసతిగృహంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను కోరారు. విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వసతిగృహ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ సబ్ కలెక్టర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థులపై వసతిగృహ వార్డెన్ అనుసరిస్తున్న వైఖరి సరిగ్గా లేదన్నారు. వసతిగృహంలో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాల్లేకపోవడంతో విద్యార్థులకు అస్వస్థతకు గురవుతున్నారని చెప్పారు. గతంలో పలుమార్లు ఎఎస్‌డబ్ల్యుఒ, డీడీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. విద్యార్థులకు మెనూ అమల్లో బాధ్యతారహితంగా వార్డెన్ వ్యవహరిస్తున్నారని చెప్పారు. తాగునీటికి, వంటకు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఒకే నీరుని ఉపయోగించడం వల్ల విద్యార్థులకు భవిష్యత్‌లో అనేకరకాల వ్యాధులు వస్తాయన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు న్యాయం చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు యు.దుర్గాప్రసాద్, తరుణ్, విద్యార్థులు ఉన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న చందు

హెల్మెట్ ధారణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. హెల్మెట్ వినియోగం, మోటారు వాహనాల చట్టం, నియమాలు, శిక్షాపరమైన నిబంధనలపై జిల్లాలోని పోలీసు అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. హెల్మెట్ వినియోగంపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో న్యాయవాదులు జి.ఇందిరాప్రసాద్, పాపినాయుడు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జైల్లో ఉన్న నిందితులు, ముద్దాయిలకు న్యాయపరమైన సలహాలు, సూచనలు కోసం జైలు న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లతో శుక్రవారం సదస్సు నిర్వహించారు. జైల్లో ఖైదీల పరిస్థితులు, వారి బాగోగులు, సమయానికి బెయిల్ మంజూరు చేసే విధానంపై జైలు న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు.

విత్తనాలు, ఎరువులు సీజ్

ప్రజాశక్తి - కొత్తూరు

మండల కేంద్రంలోని గుడ్ల కృష్ణారావు ఎరువుల దుకాణంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను విజిలెన్స్ అధికారులను శుక్రవారం సీజ్ చేశారు. దుకాణాన్ని పరిశీలించిన విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు రికార్డులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, గొడౌన్‌లో నిల్వలను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణలో లోపాలు, స్టాక్ నిల్వల్లో తేడాలు ఉండడంతో రూ.34 లక్షల విలువ గల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సీజ్ చేశారు. షాపు యజమానికి నోటీసు ఇచ్చారు. తనిఖీల్లో విజిలెన్స్ డిఎస్‌పి ఎస్.కిరణ్ కుమార్, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎల్.మురళీకృష్ణ, వ్యవసాయశాఖ అధికారులు పి.మురళీకృష్ణ, ఎన్.శ్రీనివాసరావు ఉన్నారు.

తనిఖీలు చేస్తున్న అధికారులు

త్వరితగతిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్‌ను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి పెండింగ్‌లో ఉన్న పనులను శుక్రవారం పరిశీలించారు. మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే ఇప్పుడే చేసుకోవచ్చన్నారు.

ప్రభుత్వ శాఖలన్నీ ఒకేచోట ఉండడం వల్ల పలు పనుల కోసం వచ్చే ప్రజలు వేర్వేరు చోట్లకు వెళ్లే అవసరం ఉండదన్నారు. జిల్లా అధికారులందరూ ఈ కార్యాలయాల్లోనే ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎఇ రాజు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపుకార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

కౌలురైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులను అందజేయాలని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తెచ్చిన కౌలు రైతుల చట్టాన్ని రద్దు చేయాలన్నారు. 2011 భూ అధీకృత రైతుల చట్టాన్ని అమలు చేసి, గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించాలన్నారు. ఈ-క్రాప్ కౌలు రైతుల పేరుతోనే నమోదు చేయాలని, పంట రుణాలు, బీమా పరిహారం, రైతుభరోసా వంటి ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కులాలతో సంబంధం లేకుండా భూమి లేని ఒసి కౌలు రైతులకూ రైతుభరోసా పథకాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల గుర్తింపునకు అధికారులు మండలాల్లో సమావేశాలు పెట్టి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. గ్రామస్థాయిలో గ్రామసభల ద్వారా కార్డులు ఇచ్చే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ మండల కార్యదర్శి టి.ధనుంజయరావు, పేడాడ గన్నయ్య, ఎం.మురళి తదితరులు పాల్గొన్నారు.

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం మరియు గ్రామంలో వేంచేసియున్న **శ్రీ కొత్తమ్మవారి దేవస్థానంలో భక్తులకు** ఫోటోలు, రక్షలు, త్రాళ్ళు విక్రయించు హక్కు కొరకు 15-7-2024ది. నుండి తే.14-7-2026ది. వరకు గల రెండు సంవత్సరముల కాలమునకు, భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు మరియు జాకెట్టుముక్కలను వసూలు చేసుకునే హక్కు కొరకు తే.1-8-2024ది. నుండి తే.31-7-2026ది. వరకు గల రెండు సంవత్సరముల కాలమునకు మరియు కొబ్బరి చెక్కలు వసూలు చేసుకొనే హక్కు కొరకు తే.1-9-2024ది. నుండి తే.31-8-2026ది. వరకు గల రెండు సంవత్సరముల కాలమునకు, తే.12-7-2024ది. శుక్రవారం ఉదయం గం. 10-00లకు, గం.11-00లకు, మరియు మధ్యాహ్నం గం.12-00లకు శ్రీ అమ్మవారి ఆలయ ప్రాంగనంలో దేవాదాయ ధర్మదాయ శాఖ అదికారుల పర్యవేక్షణలో, బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును.

ఆసక్తి గల పాటదారులు పై తేదిలో ప్రదమదరావత్తులు ఫోటోలు, రక్షలు, త్రాళ్ళు విక్రయించు హక్కు కొరకు రూ. 10000/- లు., చీరలు మరియు జాకెట్టుముక్కలను వసూలు చేసుకునే హక్కు కొరకు రూ.5000/- లు., కొబ్బరి చెక్కలు వసూలు చేసుకొనే హక్కు కొరకు రూ.10000/-లు. చెల్లించి టెండరు కమ్ బహిరంగ వేలం పాటలో పాల్గొనవలెనని యావన్మందికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సం/- వి.రాధాకృష్ణ,
కార్యనిర్వహణాధికారి, శ్రీ కొత్తమ్మవారి దేవస్థానం, కోటబొమ్మాళి (V&M).

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్య సముఖమునకు.
IA. 72/2024 in AS.6/2021

పిటీషనర్ అప్పీలెంట్లు:-
తమ్మినేని రాములు (డైడ్) వగైరాలు.
రెస్పాండెంట్లు :-
మెట్ట మాణిక్యం (డైడ్) వగైరాలు.

To,
తిర్లింగి జగదాంబ, భర్త రాము 33 సం॥లు, హిందూ, అక్కివలస గ్రామం, జలుమూరు మండలం, శ్రీకాకుళం జిల్లా. - R3

పై నెంబరు అప్పీలులో పిటీషనర్-అప్పీలెంట్లు రెస్పాండెంట్లు అయిన మెట్ట మాణిక్యం వగైరాలుపైన అప్పీలు పై కోర్టులో దాఖలు చేయగా సదరు అప్పీలు కోర్టులో పెండింగ్‌లో ఉంటుండగా 1వ రెస్పాండెంట్ అయిన, మెట్ట మాణిక్యం కాలము చేసినందున ఆమెకు మీరు కుమార్తె అయినందున మరియు వారసురాలు అయినందున పై కోర్టులో LRS పిటీషన్ దాఖలు చేయగా పై కోర్టులో మీ హాజరు నిమిత్తం **15-7-2024న వాయిదా అయి ఉన్నది.** సదరు వాయిదా నాడు మీరు గాని మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్ష మందు అప్పీలు తీర్మానించబడును.

ఇట్లు
మెట్ట దామోదరరావు
న్యాయవాది, రాజాం.

అమరావతి నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- పాతపట్నం

లోకేష్‌కు చెక్కును అందజేస్తున్న గౌరీశంకర్ నాయుడు

మండలం కొరసవాడకు చెందిన మడ్డు గౌరీ శంకర్ నాయుడు మంగళగిరి ఎయిమ్స్‌లో రెసిడెంట్ డాక్టర్‌గా పని చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను శుక్రవారం కలిసి ఆయన నెల జీతం రూ.లక్ష చెక్కును తనవంతుగా అమరావతి నిర్మాణానికి విరాళంగా ఇచ్చారు. లోకేష్ గౌరీ శంకర్ నాయుడును అభినందించి, ఇదే స్ఫూర్తితో ప్రతిఒక్కరూ రాజధాని నిర్మాణానికి ముందుకు రావాలన్నారు. మడ్డు గౌరీ శంకర్ నాయుడు తండ్రి మడ్డు వెంకటరమణ ప్రస్తుతం సారవకోట మండలం విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్నారు. గౌరీ శంకర్ తాత మడ్డు రామినాయుడు పాతపట్నం ఎంపిపిగా గతంలో పనిచేశారు. మడ్డు గౌరీ శంకర్ నాయుడు రాజధాని నిర్మాణానికి విరాళం అందించడం మండల ప్రజలతో పాటు రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఇన్‌ఛార్జి రామరాజు అభినందనలు తెలియజేశారు.

కెనాల్ మరమ్మతులు చేయించాలి

టెక్కలి రూరల్: మండలం గోపీనాథపురంలో ఉన్న కెనాల్ 49 ఆర్‌లో 1ఆర్ పనులను యుద్ధ ప్రాతిపదికన వెంటనే పూర్తి చేయాలని మంత్రి కింజరాపు అచ్చెంనాయుడుకు గోపినాధపురం గ్రామ రైతులు కోరారు. 49లో 1ఆర్‌లో కెనాల్ పనులను పూర్తి చేయడం వలన 150 నుంచి 200 ఎకరాల సాగు భూములకు సాగునీరు అందుతుందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లుగా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో కెనాల్ పూర్తిగా పూడికపోయిందని, చేరివీధి, ఊర ట్యాంక్ దగ్గర కిల్లిపోలమ్మ తల్లి గుడి ఆవరణలో సుమారు 300 మీటర్లు నుంచి 400 మీటర్లు ఆక్రమణకు గురైందని, ఆ ఆక్రమణలు తొలగించి పూర్తిగా బాగు చేసి రైతాంగానికి సాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి మండలం తెలుగుదేశం యువత కార్యదర్శి సత్తార్ మనోజ్ కుమార్, రైతులు బమ్మిడి మోహనరావు , దవల శ్రీను, సత్తారు శ్రీను, బమ్మిడి ధర్మారావు, ధవల వెంకటరమణ, దవల కుశుడు, రమేష్ తదితరులున్నారు.

ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఆరోగ్య సేవలు మెరుగుపడాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఆరోగ్య సేవలు మెరుగు పడాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని ఆకస్మికంగా పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలతో పాటు వార్డులను పర్యవేక్షించి రోగులతో మాట్లాడి ఆస్పత్రి సిబ్బంది పని తీరుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో 2014-2019 మధ్య తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రాష్ట్రంలోనే నరసన్నపేట ఆస్పత్రి గర్భిణీలకు సంబంధించిన చికిత్సల్లో మొదటి స్థానంలో నిలిచిందని, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే కనీసం పొంతన లేకుండా పోయిందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు మళ్లీ గతంలో కంటే మెరుగైన వైద్యం రోగులకు అందజేసి మొదటి స్థానంలో నిలిచేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. అనంతరం రోగులకు పెట్టె భోజనాలపై ఆరా తీసి సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ జయశ్రీ, పరిపాలనాధికారి రమణమూర్తి, వైద్యులు శ్రీనుబాబు, సిబ్బంది, నాయకులు, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, ఎం.వెంకటప్పల నాయుడు, లుకలాపు రాంబాబు, జామి వెంకటరావు, బోయిన సతీష్, రామారావు ఉన్నారు.

'ఐతమ్'లో పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో బిఎస్ అండ్ హెచ్ విభాగంలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న కోరెడ్డి విజయలక్ష్మి, గుత్తావెల్లి పోలీస్ నాయుడు, నడిమింటి శైలజలు రాసిన 'కాంపోనెంట్స్ ఆఫ్ ఇంగ్లీష్ లిటరేచర్ యలాంగ్ విత్ లాంగ్వేజ్' అనే నూతన పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం బిటెక్, డిగ్రీ, లిటరేచర్ కోర్సుల్లో ఆంగ్లభాష నేర్చుకొనే వారికి ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థులకు, సమాజానికి ఉపయోగ పడే మరిన్ని మంచి పుస్తకాలను సరళభాషలో రాయాలని పుస్తక రచయితలకు సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, మల్లా రమణయ్య, ఎం.వి.రత్నమణి, అసిస్టెంట్ హెచ్‌బిడి డాక్టర్ ఎం.పాపినాయుడు, రచయితలు విజయలక్ష్మి, శైలజ, పాపినాయుడు ఉన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు

కౌలు రైతులకు గుర్తింపుకార్డులు

మెళియాపుట్టి: మండలం జాడుపల్లి, పరశురాంపురం గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులకు, కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఒ దానకర్ణుడు మాట్లాడుతూ కవులుదారు కార్డులు తీసుకున్న ప్రతి కౌలు రైతుకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కౌలుదారు కార్డు తీసుకున్న రైతులు పంట నమోదు, పంటల బీమా, విత్తనాలు, ఎరువులు తీసుకోవడానికి, ధాన్యం మద్దతు ధరకు విక్రయించడానికి, ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే పంట నష్టపరిహారం, రుణ సదుపాయం పొందవచ్చునన్నారు. రైతులు రైతు సేవా కేంద్రంలో విఆర్ఒ లేదా విఎఎకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో కలుపు, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పరశురాంపురం సర్పంచ్ ప్రసాదరావు, జాడిపల్లి ఎంపిటిసి పైడిరాజు, సుజాత, చీపురుపల్లి సర్పంచ్ ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలో కొఠారి, ఈదుపురం, బెల్లుపాడ గ్రామాల్లో కౌలు రైతుల గుర్తింపు కార్డులు జారీ చేయుటకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి టి. భార్గవి మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు 2024-25 ఖరీఫ్, రబీ పంట కాలానికి సంబంధించి పొలం కౌలుకు సాగు చేసే ప్రతి రైతు

ఇచ్ఛాపురం : రైతులతో మాట్లాడుతున్న ఎఒ భార్గవి

తప్పనిసరిగా రెవిన్యూశాఖ జారీ చేసేకౌలు గుర్తింపు కార్డు తీసుకోవాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో గతేడాది సేకరించిన మట్టి నమూనా పత్రాలు రైతులకు అందజేశారు. ఈ సమావేశంలో సాడి సహదేవ్‌రెడ్డి, నర్తు వరప్రసాద్, అసీ చిరంజీవులు రెడ్డి, పీతాంబర రెడ్డి, ఢిల్లీ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: బెండి సచివాలయంలో వ్యవసాయ అధికారులు, కౌలు రైతులతో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి కణితి సురేష్ సమావేశం ఏర్పాటు చేసారు. కౌలు రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు కౌలు రైతులను గుర్తించాలని, వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు అందించడం ద్వారా పంట నష్టపరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ రంగానికి ఉచిత ఇసుక ఊతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిర్మాణ రంగాన్ని ఆదుకునేందుకు వీలుగా ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలన్న చంద్రబాబు ప్రభుత్వ ఆలోచన కార్మికులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు అన్నారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు మార్కెట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం తెచ్చిన ఇసుక పాలసీతో సంక్షోభాన్ని సృష్టించి నిర్మాణ రంగాన్ని దివాలా తీయించిందని, నాలుగు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును గత ప్రభుత్వం నిలిపి వేయడంతో పాటు బోర్డులో ఉన్న నిధులు దారిమళ్లించారని ఆరోపించారు. బోర్డు ద్వారా అందించాల్సిన సంక్షేమ పథకాలను నిలిపివేసి 46 వేలు క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నా పట్టించు కోలేదన్నారు. దీంతో కార్మికుల కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేసినా పట్టించు కోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కార్మిక

మాట్లాడుతున్న షణ్ముఖరావు

రంగానికి మేలు చేకూర్చే విధంగా ఉచిత ఇసుక విధానాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. సమావేశంలో ఎపి.భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ సూర్యనారాయణ, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు చుక్క రాము, కార్మిక, కర్షక ఐక్య కార్యాచరణ సమితి జిల్లా నాయకులు బలగ శ్రీరామ్మూర్తి, చింతు ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్‌జిఒ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం శు భాకాంక్షలు తెలిపారు. వారితో పాటు ఎపిఎన్‌జిఒ నాయకులు బడగల పూర్ణ చంద్రరావు, సోమేశ్వరరావు, వేణుగోపాల్ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై కలెక్టర్ సమీక్ష

జిల్లాలో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు పంపిణీ శతశాతం పూర్తి చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. ఆయన చాంబరులో మర్యాద పూర్వకంగా కలిసేందుకు వచ్చిన డిఆర్‌డిఎ పిడి కిరణ్ కుమార్, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, ఎల్‌డిఎం సూర్యకిరణ్, డిపిఒ వెంకటేశ్వరరావు, ఇతర శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్‌జిఒ నాయకులు

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

పలాస: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎఇ అవినాష్, ఆర్ఐ అమర్ ఉన్నారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తించి గత నెల అనారోగ్యం బారినపడి మరణించిన హోంగార్డు జి.దాలయ్య కుటుంబానికి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్.రాధిక చేతులమీదుగా జిల్లాలోని దాలయ్య సహచర హోంగార్డులు అందజేసిన ఒక్కరోజు గౌరవ వేతనం నగదు మొత్తం రూ.4 లక్షల 16 వేలు చెక్కును అందజేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ దాలయ్య మరణించడం చాలా బాధాకరమని, వీలైనంత త్వరగా కుటుంబ సభ్యుల్లో ఒకరికి హోంగార్డుగా నియామకాన్ని కల్పిస్తామని భరోసా కల్పించారు. ఎటువంటి

దాలయ్య కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

అవసరం ఉన్నా పోలీసుశాఖ ఎల్లప్పుడు తోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ప్రేమ కాజల్, హోంగార్డు ఆర్ఐ సురేష్ ఉన్నారు.

నేడు ఉచిత రేబిస్ వ్యాక్సిన్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జూనోసిస్ డే ను పురస్కరించుకుని శనివారం టెక్కలి చిన్న బజార్ వెటర్నరీ ఆస్పత్రి ఆవరణలో పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు టెక్కలి పశుసంవర్ధకశాఖ ఎడి జి.రఘునాథ్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి పశువైద్య ప్రాంతీయ ఆస్పత్రిలో పెంపుడు జంతువులకు ఉచితంగా రాబీస్ టీకాలు వేయటం జరుగుతుందని, ఈ అవకాశాన్ని పెంపుడు జంతువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఎడి డాక్టర్ మంద లోకనాధం తెలిపారు. ప్రాణాంతక వ్యాధులైన ర్యాబీస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ వ్యాధులు ప్రజలకు ప్రబలకుండా ఈ టీకాలు కుక్కలకు వేయించాలని ఆయన సూచించారు.

ఎరువుల పంపిణీ

బూర్జ: పెద్దపేట రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో మాజీ జెడ్‌పిటిసి ఆనెపు రామకృష్ణ, మాజీ రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కె.గోవిందరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయమని, రైతులందరికీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వంటివి నాణ్యమైనవి అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుప్పాడ వెంకట అప్పల నాయుడు, కె.కృష్ణ, ఆదినారాయణ, నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పాలవలసలో మాజీ డిసిఎంఎస్ సభ్యులు జల్లు బలరాం నాయుడు ఆధ్వర్యంలో ఎరువులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది జగదీష్, హేమలత పాల్గొన్నారు.

ఆడిట్ రిటర్న్‌లు పూర్తి చేయాలి

ఆమదాలవలస గ్రామ సంఘాలన్ని సకాలంలో ఆడిట్ రిటర్న్ పూర్తి చేయాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన విఒఎల సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం లెక్కలను ముగించి, చార్టర్డ్ అకౌంటెంట్‌తో ఆడిట్ చేయించిన తరువాత గ్రామ సంఘాల్లో నోటీసులు ఇచ్చి, మహా జనసభలు పూర్తి చేసి డిసిఒ కార్యాలయానికి రిటర్న్‌లు ఇచ్చి అకనాలెడ్జిమెంట్ తీసుకోవాలని సూచించారు. గ్రామ సంఘాల ద్వారా తీసుకున్న సిఐఎఫ్ శ్రీనిధి, ఉన్నతి రుణాలను శతశాతం రీపేమెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం పైడి కూర్మారావు, అకౌంటెంట్ రోజా, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్‌తో పాటు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పోలాకి: ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకులపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో పరిశీలించి తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామని ఎపిడి మురళీ కృష్ణ అన్నారు. శుక్రవారం డిఎల్‌పురం సచివాలయంలో గతంలో అందిన ఫిర్యాదులపై పరిశీలనకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర సహాయకులు తులసిపై వేతనదారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే తాము పనిచేసినా మస్టర్ వేయడం లేదని, పనులకు రానివారికి హాజరు వేసి వేతనాలు స్వాహ చేస్తున్నారని, తమకు జాబ్ కార్డులు ఇవ్వడం లేదని వేతనదారులు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేసారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని ఎపిడి

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి మురళీకృష్ణ

తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ రమణారావు, ఇసి మునీంద్రా, టిఎలు రజిని, జనార్ధనరావు, గ్రామపెద్దలు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పొందూరు: యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్‌లోని సాంకేతిక లోపాలను తక్షణమే సవరించి సమస్యలను పరిష్కరించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం తాడివలస ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాలలు పున్నప్రారంభమై సుమారు నెల రోజులు గడుస్తున్నా ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలు స్కూల్ అటెండెన్స్ యాప్‌లో కనిపించకపోవడంతో మధ్యాహ్న భోజనపథకం అమలు చేయడంలో హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. సెలవుల ముందే పాఠశాల విడిచి వెళ్లిన విద్యార్థులను వివిధ పాఠశాలలకు మ్యాపింగ్ చేయడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, శుక్రవారం చాలా

మాట్లాడుతున్న హరిప్రసన్న

పాఠశాలల్లో గతంలో నమోదై ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల వివరాలు కూడా కనిపించక పోవడంతో అంతా గందరగోళంగా మారిందన్నారు. ఇప్పటికైనా జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు తక్షణమే స్పందించి యుడైస్‌లోని సాంకేతిక సమస్యలన్నింటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మండల ఉపాధ్యక్షులు చౌదరి వేణుగోపాల్, మెట్ట అనంతభట్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

జీవనోపాధి మెరుగుకు కృషి

ఆమదాలవలస: మహిళా స్వయంశక్తి సంఘాల్లో పదివేల లోపు కుటుంబ ఆదాయం ఉన్న మహిళలను గుర్తించి మండల సమాఖ్యకు తెలియపర్చాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శుక్రవారం స్థానిక దూసి పంచాయతీలో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన గ్రామైక్య సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాల్లో జీవనోపాధులను మెరుగుపర్చడానికి అవసరమైన రుణ సౌకర్యం శ్రీనిధి బ్యాంకు ద్వారా కల్పించి వారి కుటుంబ ఆదాయాన్ని మెరుగుపర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. ప్రతి కుటుంబంలో ఆడపిల్లలను కూడా మగ పిల్లలతో సమానంగా చదివించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బాల్యవివాహాలు చేయకూడదని, ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులతో పాటు క్లస్టర్ కో-ఆర్డినేటర్ చందర్రావు, విఒఎ సువర్ణ, స్వయంశక్తి సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

మృతుడు వెంకటరావు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని కొత్తగ్రహారం పంచాయతీ జెడ్యాడ గ్రామ సమీపంలో 11 కె.వి వైర్లకు రహదారిపై తగిలి శుక్రవారం వ్యక్తి మృతి చెందాడు. కోటబొమ్మాళి మండలం కొత్తపేటకు చెందిన అత్తిని వెంకటరావు (36) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. అయితే విధుల్లో భాగంగా ప్రొక్లెయిన్‌ను లారీపై తీసుకుని వెళ్తుండగా జెడ్యాడ గ్రామ సమీపంలో రహదారిపై విద్యుత్ వైర్లు ప్రొక్లెయిన్‌కు తగులుతాయోమోనని లారీపై నుంచి చూస్తుండగా ఒక్కసారిగా ప్రొక్లెయిన్‌కు వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై వెంకటరావు మృతి చెందాడు. మృతుని భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు

బెల్లం ఊట ధ్వంసం

సోంపేట: సోంపేట సర్కిల్ పరిధి మందస మండలం కొండలూగాం పంచాయతీ చాపరాయి గ్రామ సమీపంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జై భీమ్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటుసారా తయారీ, రవాణాలపై విస్తృత దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాటుసారా ఎక్కడైనా అమ్మినట్లు ప్రజలకు తెలిస్తే 9448902358 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ దాడుల్లో మోహనరావు, పాపారావు, నాయుడు పాల్గొన్నారు.

మహిళపై దాడి

లావేరు: మండలంలోని తాళ్లవలసలో వాళ్లే రాధ అనే మహిళ ఈ నెల 3న ఉదయం పాలకేంద్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన వారితో పొదుపు సంఘాలకు చెందిన లావాదేవీల విషయంపై అడుగుతుండగా సంచాన సత్య నారాయణ, రేవతి, ఈశ్వరమ్మ, కృష్ణవేణి, రమేష్‌లు కలిసి ఒక్కసారిగా రాధపై దాడి చేసి చీర విప్పి గొంతుకు చుట్టి హత్యాయత్నం చేయడంతో రాధ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సిహెచ్ స్వామి నాయుడు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి పి.రామారావు తెలిపారు.

పంప్‌హౌస్‌కు తాళంపై ఫిర్యాదు

వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేటలో ప్రజలకు తాగునీరు అందించే పంప్‌హౌస్‌కి అధికార పార్టీ నాయకులు తాళం వేయడంపై సర్పంచ్ వంక సత్యరాజ్, మండల వైస్ ఎంపిపి వంక రాజు శుక్రవారం తహశీల్దార్ ఎం.సురేష్, ఎంపిడిఒ డిక్కల తిరుమలరావు, ఎస్ఐ సిహెచ్ రామారావులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో 700 కుటుంబాలు ఉన్నాయని, ఈ పంప్ హౌస్ నీటిపైనే తాగునీటికి ప్రజలు ఆధారపడి ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ నిధులతో ఆపరేటర్‌గా చోడిపల్లి రామారావుకు బాధ్యతలు అప్పగించినట్లు సర్పంచ్ తెలిపారు. సర్పంచ్‌కు సహకరిస్తే ఊరుకొనేది లేదని ఆపరేటర్‌పై ఒత్తిడి చేస్తూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు చొరవ తీసుకొని అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకొని గ్రామస్తులకు తాగునీరు సక్రమంగా అందే విధంగా చొరవ చూపాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచ్ విధులకు, హక్కులను భంగం కలిగిస్తూ దుర్భాషలాడిన టిడిపి నాయకుడు గుళ్ల చిన్నారావు, అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక స్వావలంబన అవసరం

టెక్కలి: సముద్ర తీరంలో చేపల వేట చేసుకుంటూ జీవనోపాధి సంపాదించుకుంటున్న మత్స్యకారులు ఆర్థిక స్వావలంభన దిశగా ఎదగాలని పలాస సహయ మత్స్యశాఖాధికారి సత్యనారాయణ కోరారు. స్థానిక మత్స్యశాఖ కార్యాలయంలో శుక్రవారం మత్స్యకార సంఘాలతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మత్స్యకార సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యగా మార్పు చేశామన్నారు. వీటి ద్వారా ఆర్థిక, సామాజిక స్వావలంబనకు ఏ విధంగా దోహద పడతాయో వివరిస్తూ అవగాహన కల్పించారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో వ్యాపారాభివృద్ధి చేసు కోవచ్చునన్నారు. ఈ సదస్సులో మత్స్యశాఖాధికారి ధర్మరాజ్, సహకార సంఘ అధ్యక్షులు పద్మనాభం, కార్తీక్ బెహరా, హేరంబో, మత్స్యశాఖ సహయకులు బగాది మధుసూదనరావు, నరేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కెజిబివి పాఠశాల తనిఖీ

కొత్తూరు: మండలంలోని వసప కెజిబివి పాఠశాలను శుక్రవారం ఎంఇఒలు గోవిందరావు, శ్రీనివాసరావు తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఇన్‌ఛార్జి ప్రత్యేకాధికారి ఉషారాణికి సూచించారు. భోజనాన్ని స్వయంగా తిని రుచి చూశారు.

ఎన్ఆర్ఐ వితరణ

కవిటి: మండలం బొరివంకకు చెందిన ఎన్ఆర్ఐ ఆనంద రౌళో దాతృత్వం చాటుకున్నారు. మండలంలోని మూత్యాలపేటలో అమృత వర్షిణి సమేత మహా మృత్యుంజయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభం తాపడం పెట్టడానికి తనవంతుగా రూ.లక్ష అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు చందాన పూర్ణ చంద్రరావు, దుద్ధి సతీష్, కపాసుకుద్ది ఉప సర్పంచ్ పి.చంద్రశేఖర్, ఆరింగి శివాజీ, వెంకటరావు, పాతిన వెంకటరావు, నారాయణరావు, వల్లభరావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యంపై చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉప కులపతి కె.ఆర్ రజనిపై అనుచితంగా ప్రవర్తించిన అధ్యాపకులు హనుమంతు సుబ్రమణ్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో రాంగోపాల్, గణేష్ తదితరులు విలేకరులతో మాట్లడారు. ఆమె పట్ల అసభ్యకరంగా, అవమానకరంగా మాట్లాడి బెదిరింపులకు పాల్పడ్డ ఆయనపై అట్రిసిటీ కేసులు నమోదు చేయాలన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

పొందూరు: తాడివలస పిహెచ్‌సి పరిధి లోలుగులో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని శుక్రవారం వైద్యాధికారులు డాక్టర్ రమేష్ నాయుడు, డాక్టర్ నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. ఇంటింటికి ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.రవికుమార్, ఎఎన్ఎం సూర్యకాంతం, హెల్త్ అసిస్టెంట్ జి.వి.అప్పారావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'పల్లా'ను కలిసిన యాదవ సంఘ సభ్యులు

ఆమదాలవలస: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను జిల్లా యాదవ యూత్ ప్రెసిడెంట్, బిసి యాదవ సాధికార కమిటీ సభ్యులు నాగళ్ల మురళీధర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం విశాఖపట్నంలో జాతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కడియం అశోక్ రత్న యాదవ్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ యాదవుల సమస్యలను పరిష్కరించి వారి ఉన్నతికి కృషి చేయాలని శ్రీనివాస్ యాదవ్‌ను కోరగా టిడిపి బిసిల పార్టీ అని వారి అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపినట్లు వివరించారు. ఈయనతో పాటు యాదవ సంఘ సభ్యులు ముగడ తవిటి నాయుడు యాదవ్, ఈదు పాపారావు, కొయ్యాన శంకర్ యాదవ్, బార్కుల సంతోష్ కుమార్ తదితరులున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

పొందూరు : తండ్యాంలో చేపడుతున్న పారిశుధ్య పనులు

పొందూరు: మండలం తండ్యాంలో సర్పంచ్ కిల్లారి అప్పల నారాయణమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు వీధుల్లో గల కాలువల్లో మురుగునీరు, చెత్తాచెదారులను తొలగించి శుభ్రపరిచారు. అలాగే రక్షిత మంచినీటి పథకానికి క్లోరినేషన్ చేశారు. కార్యదర్శి ఎన్.శంకరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ కిల్లారి భాస్కరరావు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలం కొరసవాడలో శుక్రవారం సర్పంచ్ జక్కర ఉమ ఆధ్వర్యంలో కాలువల్లో పూడికలు తీయించి శానిటేషన్ పనులు నిర్వహించారు. బ్లీచింగ్ చల్లించి శానిటైజేషన్ చేయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ ఉమ గ్రామస్తులకు సూచించారు. ఇఒపిఆర్‌డి టి. కృష్ణారావు, సెక్రెటరీ కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని శ్రీనివాస చార్యులపేట, చీమలవలస గ్రామాల్లో సర్పంచ్‌లు బొడ్డేపల్లి గౌరీపతిరావు, సనపల చెల్లంనాయుడు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. వీధులను శుభ్రపరుస్తూ మురికి కాలువల్లో చెత్తను తొలగించి క్లోరినేషన్ చేపట్టారు. పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి ట్రాక్టర్‌తో తరలించారు. అలాగే అక్కులపేటలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. సెక్రటరీ నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

రణస్థలం రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట, హామీలు, నిలబెట్టుకోవాలని రాష్ట్ర బిసి సెల్ కన్వీనర్ కొత్తకోట్ల సింహాద్రి నాయుడు అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 16,741 టీచర్స్ పోస్టులకు కొత్త నోటిఫికేషన్ ఇవ్వబోతుందని, టెట్ కమ్ టిఆర్‌టి పెట్టాలన్నారు. 2022లో జరిగిన టెట్ పరీక్షలో 150 మార్కులకు పరీక్ష పెడితే 150 మార్కులకు 150 మార్కులు ఎక్కువ మందికి వచ్చాయన్నారు. 2018 డిఎస్‌సి నోటిఫికేషన్ తరువాత ఇప్పటి వరకు డిఎస్‌సి నోటిఫికేషన్ రాలేదని, ఈ డిఎస్‌సికి వయోపరిమితి పెంచి వారికి అవకాశం ఇవ్వాలన్నారు. 2024 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారని, ఇప్పుడు మాటమార్చడం మంచిది కాదన్నారు. 2024 డిఎస్‌సిలో భర్తీ చేయబోయే ఉపాధ్యాయ పోస్టులను టెట్ కమ్ టిఆర్‌టి ద్వారా భర్తీ చేయాలని మంత్రి లోకేష్‌ను కోరడం జరుగుతుందన్నారు. రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కె.లక్ష్మి ఉన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమానికి తీరనిలోటు

ప్రజాశక్తి- పలాస

ఓంకార్ మాస్టర్ మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని, ఆయన కుటుంబానికి యుటిఎఫ్ అండగా ఉంటుందని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్, పలాస మండల విద్యాశాఖాధికారులు సిహెచ్ శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం స్పష్టం చేశారు. పద్మనాభ పురం కాలనీ పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం బత్తిన ఓంకార్, బూరెల జగ్గారావు మాస్టర్ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఓంకార్ మాస్టర్, జగ్గారావు మాస్టర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓంకార్ మాస్టర్ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేశారని గుర్తు చేశారు. ఓంకార్ మాస్టర్ ఆశయాలను కొనసాగించాలన్నారు. ఉద్దాన ప్రాంత సమస్యలను తన సమస్యలుగా భావించి పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఉపాధ్యాయుడుగా వృత్తిలో పని చేస్తూ ఉపాధ్యాయ సమస్యల పోరాటంలో కీలకపాత్ర పోషించారన్నారు. జగ్గారావు మాస్టర్ పలాస ప్రాంతంలో యూటిఎఫ్ నిర్మాణానికి కృషి చేస్తూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి, లఖినాన వెంకటాచలం, కంచరాన రమేష్, లఖినాన ఢిల్లీశ్వరరావు, ఇ.సిద్దేశ్వరరావు, గుంట కోదండరావు, బల్ల చిట్టిబాబు, దుమ్ము శంకర్రావు, బమ్మిడి ఆనంద రావు, దువ్వాడ జనార్ధన, తెప్పల అజయ్ కుమార్,

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్

గున్న మధుసూదనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, గున్న రమేష్, కంచరాన జయరాం, ఎస్‌వి రమణ, పి.సంజయ్ కుమార్, కె.రవీంద్ర, బెండి లక్ష్మి, శశిధర్ వర్మ, టి.జయరాం, ఎస్‌వి పట్నాయక్, ఎం.శ్రీనివాసరావు, పోతనపల్లి బాలరాజు, కంచరాన పాపారావు, ఉప్పాడ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.